క్లుప్తంగా

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్నికపై హర్షం

కాగజ్‌నగర్‌టౌన్: ఇటీవల రంగారెడ్డి జిల్లాలోని మన్నెగూడలో జరిగిన టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల్లో జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శిగా వైద్య శాంతి కుమారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై సంఘం కాగజ్‌నగర్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిపాల్, శివానందలతో పాటు మండల పదాధికారులు హర్షం వ్యక్తం చేశారు.

మోడల్ స్కూల్‌లో రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారి సంస్థ (డీబీఎల్) ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛత రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు దాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, సంస్థ రీజినల్ ఇంజనీర్ నీరజ్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ ప్రతాప్, రఘువేందర్, పీడీ తిరుపతి తదితరులు ఉన్నారు.

23న మున్నూరుకాపు కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 23న జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం స్థలంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు గడ్డల సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల మున్నూరుకాపులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

కౌటాల: మండలంలోని తాటినగర్ గ్రామానికి చెందిన మాలి సంఘ నాయకులు కొత్రంగే భీంరావ్ అనారోగ్యంతో బాధపడుతుండగా మాలి సంఘం నాయకులు బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి మాలీ సంఘం అండగా ఉంటుందన్నారు. సంఘం తరుపున రూ. 9100 ఆర్థిక సాయం అందజేశారు. మాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు, నాయకులు నికొగే హన్మంతు, నాందేవ్, రాము, ముక్తేశ్వర్, ఆదే చందు, పాండురంగ్, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అల్పాహారం

కౌటాల: బెజ్జూర్ మండలంలోని ఎల్కపల్లి గ్రామం నుంచి మహారాష్ట్రలోని చెప్రాలా మందిరానికి పాదయాత్ర చేపట్టిన భక్తులకు బుధవారం కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద తాటిపల్లి హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు అల్పాహారం అందించారు. బెజ్జూర్ నుంచి భక్తులు ఏటా చెప్రాలా ఆలయానికి పాదయాత్రగా వెళ్తారన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఎల్ములే దత్తు పటేల్, సుధాకర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

నార్నూర్: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగమని మండల వ్యవసాయ శాఖ అధికారి గిత్తె రమేశ్ అన్నారు. మండలంలోని సుంగాపూర్ కొలాంగూడ గ్రామంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం–2023గా ప్రకటించిన నేపథ్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు చిరుధాన్యాలపై దృష్టి సారించేలా గ్రామీణ ప్రాంతంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తుడు ప్రేంసింగ్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో(రూ.లో)
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
టమాట	20
బీరకాయ	60
కాకరకాయ	40
బెండకాయ	40
అలసంత	60
దొండకాయ	80
మిర్చి	80
సోరకాయ	80
చిక్కుడుకాయ	60
గోబి (పూల్)	40
క్యాబేజి	60

– ఆసిఫాబాద్‌అర్బన్

సినిమాలు

ఆసిఫాబాద్ (కుమురం భీం):
వీరసింహారెడ్డి/వాల్తేరు వీరయ్య
కాగజ్‌నగర్ (వెంకటరమణ):
వీరసింహారెడ్డి/ వాల్తేరు వీరయ్య

పత్తితీతకు వలస కూలీలు

- మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌ల నుంచి వస్తున్న కూలీలు
- మూడు నెలలపాటు ఇక్కడే మకాం
- సీజన్ ముగిసిన తర్వాత సొంతూళ్లకు పయనం



దహెగాంలో పత్తి ఏరుతున్న మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన కూలీలు

దహెగాం: ఉపాధి లేక రాష్ట్రం కాని రాష్ట్రం నుంచి వలస కూలీలు తెలంగాణకు వచ్చి కొన్ని నెలల పాటు ఇక్కడే మకాం వేస్తున్నారు. ఒకప్పుడు తెలంగాణలో ఉపాధి దొరక్క ఇక్కడి కూలీలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. ప్రస్తుతం తెలంగాణలో పంటలు బాగా పండుతున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాల కూలీలు ఇక్కడికి వస్తున్నారు. దీంతో రైతులకు కూలీల కొరత తీరుతోంది.

ఇతర రాష్ట్రాల నుంచి వలస కూలీలు..

పత్తితీత సీజన్ ప్రారంభం కాగానే డిసెంబర్ మొదటి వారంలో మహారాష్ట్ర, రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కూలీలు వస్తుంటారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని దహెగాం, పెంచికల్‌పేట్, కౌటాల, కాగజ్‌నగర్, బెజ్జూర్, సిర్పూర్(టి) మండలాలతో పాటు మంచిర్యాల జిల్లాలోని పలు మండలాల్లో కూడా వలస కూలీలు కనిపిస్తున్నారు. సీజన్ ప్రారంభం కాగానే కూలీలకు రైతులు ఫోన్‌లో సమాచారం ఇస్తున్నారు. దీంతో కూలీలు ఇంటిల్లిపాది చిన్నపిల్లలతో సహా వలస వస్తున్నారు. వచ్చిన కూలీలకు రైతులు ఉండడానికి ఇళ్లు, తాగునీరు, వంట చెరుకు సౌకర్యం వంటివి కల్పిస్తూ కూలీలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారు.

రోజుకు రూ. 500 నుంచి రూ. 700 వరకు..

పత్తి తీయడానికి వచ్చిన కూలీలతో రైతులు ముందుగా ఒప్పందం చేసుకుంటున్నారు. మొదటి, రెండో విడత పత్తితీత కూడా వారే చేపట్టేలా ఒప్పందం చేసుకుంటున్నారు. మొదటిసారి కిలోకు రూ.10 చొప్పున, రెండో సారి పత్తి తీతకు రూ. 12 నుంచి రూ. 14 చెల్లిస్తున్నారు. కూలీలను పత్తి చేనుకు తీసుకెళ్లేందుకు ఆటో, ట్రాక్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. రెండోవిడత పత్తితీత సమయంలో పత్తి బరువుగా లేకపోవడంతో రోజుకు రూ.500 నుంచి రూ.700 వరకు సంపాదిస్తున్నామని వలస కూలీలు పేర్కొంటున్నారు.

ఐదేళ్ల నుంచి వస్తున్నాం



మాది మధ్యప్రదేశ్ రాష్ట్రం. మాకు అక్కడ జనవరి, ఫిబ్రవరిలో ఉపాధి దొరుకదు. దీంతో చిన్నా, పెద్దా అందరం ఇక్కడికి వస్తుంటాం. గత ఐదేళ్లుగా పత్తితీత పనులు ప్రారంభం కాగానే వస్తున్నాం. సీజన్ ముగిసే సరికి తిండి ఖర్చులకు పోను ఒక్కొక్కరం రూ. 20వేల నుంచి రూ. 30వేల వరకు సంపాదిస్తున్నాం.

– నరేశ్, కూలీ, మధ్యప్రదేశ్

చేతినిండా పని



పత్తితీత సీజన్ ప్రారంభం అయినప్పటి నుంచి మాకు మూడు నెలలపాటు చేతి నిండా పని దొరుకుతుంది. మండలంలోని పెసరికుంట గ్రామంలో రైతు ఇంట్లో ఉండి పత్తి తీస్తున్నాం. రోజుకు రూ.500 నుంచి రూ.600 వరకు సంపాదిస్తున్నాం. పత్తితీత ముగియగానే రైతులు డబ్బులు ఇస్తున్నారు.

– మగ్దూల్, కూలీ, రాజస్తాన్

పార్కింగ్ లేక పరేషాన్



రోడ్డుకు ఆనుకుని నిలిపిన వాహనాలు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పార్కింగ్ ఇక్కట్లతో ప్రతి నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై తరుచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఉన్న వ్యాపారసముదాయాల ప్రాంతాలతో పాటు సిర్పూర్(టి) –కాగజ్‌నగర్ ప్రధాన రహదారి, సిర్పూర్(టి)– కౌటాల ప్రధాన రహదారి, సిర్పూర్(టి)–మాకిడి అంతర్రాష్ట్ర రహదారులలో ఎక్కడా పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ప్రధాన రహదారులకు ఇరుపక్కల వాహనాలు నిలుపుతున్నారు. స్థానిక బస్టాండ్ ప్రాంతంలో వ్యాపార సముదాయాల ఎదుట వాహనాలు నిలుపుతుండటంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ప్రధాన రహదారిపై ఉన్న స్టేట్ బ్యాంక్, ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి, గ్రామపంచాయతీ కార్యాలయాలతో పాటు రైల్వేస్టేషన్‌లో సైతం పార్కింగ్ లేకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తరుచూ రోడ్డు ప్రమాదాలు

మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో పార్కింగ్ స్థలం లేకపోవడంతో వ్యాపారసముదాయాల ఎదుట రోడ్డుకు ఆనుకొని వాహనాలు నిలుపుతుండటంతో ప్రధాన రహదారిపై వెళ్లే వాహనదారులు తరుచూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ప్రధాన రహదారులతో పాటు స్థానిక బస్టాండ్ ప్రాంతంలో పార్కింగ్ స్థలం కేటాయించి ట్రాఫిక్ అంతరాయం, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పార్కింగ్‌కు స్థలం కేటాయించాలి



మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతం, ప్రధాన రహదారుల సమీపంలో, ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో పార్కింగ్‌కు స్థలాలు కేటాయించాలి. పార్కింగ్ సమస్యతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

– పుల్లూరి సంతోష్, స్థానికుడు

అధికారులు స్పందించాలి



మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వేస్టేషన్‌లలో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కనే వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించాలి.

– ఎస్. మహేష్, స్థానికుడు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జుమ్మిడి సౌందర్య

రెబ్బెన: మండలంలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటిస్తూ గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మించే కట్టడాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వొద్దన్నారు. కంటివెలుగు కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో అంజద్‌పాషా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రం సందర్శన



వివరాలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో కొనసాగుతున్న నితాన్నదాన సత్రాన్ని బుధవారం శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీ సద్గురు మధుసూదన్ సాయి సందర్శించారు. శ్రీ సత్యసాయి వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన నిత్యాన్నదాన సత్రాన్ని సందర్శించారు. కోనేరు కోనప్ప, ఆయన సతీమణి రమాదేవిలతో కలిసి నిత్యాన్నదాన సత్రంలోని వంట గదులు, స్టోర్ రూమ్, డైనింగ్‌హాల్, భోజనం తయారీకి ఉపయోగించే ఆధునాతన యంత్రాలను పరిశీలించి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. అన్నదాన సత్రం ద్వారా ప్రతిరోజు వందలాది మంది ఆకలి తీరుస్తున్న ఎమ్మెల్యే సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ గిరీష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌తోనే సబ్బండ వర్గాల అభ్యున్నతి



పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: టీడీపీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తోనే సబ్బండ వర్గాల అభ్యున్నతి సాధ్యమైందని ఆసిఫాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పెరుగు ఆత్మారాం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకొని ఆదిలాబాద్ పార్లమెంటు అధ్యక్షుడు ఆనంద్‌తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టీఎన్ఎస్ఎఫ్ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పోల్కర్ సాయిరాం, నాయకులు మడావి దౌలత్, దుర్గం రవి పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

కాగజ్‌నగర్‌టౌన్: నందమూరి తారక రామారావు వర్ధంతిని టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం ఎన్టీఆర్ విగ్రహం వద్ద 500 మందికి అన్నదానం చేపట్టారు. ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు గుల్లపల్లి ఆనంద్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: పీఆర్‌టీయూ సంఘం 2023 సంవత్సరానికి సంబంధించిన నూతన డైరీ, క్యాలెండర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి తన నివాసంలో సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనదని, విద్యార్థులకు ఉన్నతమైన విద్య అందించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ సెక్రటరీ మధుకర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేశ్వర్, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్, నాయకులు చంద్రశేఖర్, మారుతి, రమేష్, గోపి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములు కాపాడాలని వినతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పోచంపాడు శివారులోని సర్వే నెంబర్ 94లోని అసైన్డ్, సీలింగ్ భూములను అక్రమంగా పట్టా చేయించుకున్న వారిపై చర్యలు తీసుకుని ఆ భూములను కాపాడాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ రాజలింగుకు వినతిపత్రం అందజేశారు. రామకృష్ణాపూర్‌కు చెందిన ఐలయ్య అనే వ్యక్తి నిరుపేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు లాక్కొని రెవెన్యూ అధికారుల సహాయంతో దొంగ పట్టా పాస్‌పుస్తకాలు సృష్టించి దాదాపు 40ఎకరాలకు గాను పాసుపుస్తకాలు కలిగి ఉన్నాడని తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన ఐలయ్యతో పాటు అతడికి సహకరించిన రెవెన్యూ అధికారులపై కూడా చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి ముత్యాల వెంకటేశ్‌గుణ, జోనల్ మహిళా కన్వీనర్ భవాణి, జిల్లా మహిళా కన్వీనర్ బొడ్డు వినోద పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడం అభినందనీయం



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్‌అర్బన్: కర్ణాటకలో నిర్వహించిన 26వ జాతీయ యువజన ఉత్సవాల్లో జిల్లా నుంచి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చడం ఎంతో అభినందనీయమని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన ఆవరణలో యువజన ఉత్సవాల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 9, 10వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాల్లో మొదటి స్థానంలో నిలిచిన జిల్లాలోని మార్లవాయికి చెందిన పద్మశ్రీ కనకరాజు గుస్సాడీ బృందం జాతీయస్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ భవన ఆవరణలో బృంద సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ముగిసిన వాలీబాల్ టోర్నీ

దండేపల్లి: జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా దండేపల్లి మండలం మాదాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. మొత్తం 28జట్లు పోటీల్లో పాల్గొనగా మొదటి బహుమతిని మాదాపూర్ జట్టు, రెండో బహుమతిని దండేపల్లి జట్టు గెలుచుకుంది. మొదటి బహుమతి కింద ట్రోఫీతో పాటు రూ.10వేల నగదు, ద్వితీయ బహుమతికి ట్రోఫీతో పాటు, రూ.5వేల నగదును అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, నాయకులు గాదె శ్రీనివాస్, ముస్కె కార్తీక్, సీపిరిశెట్టి శ్రీనివాస్, తాళ్లపెల్లి వంశీ, బత్తుల శేఖర్, పట్టి వెంకటకృష్ణ, కర్నాల కిషన్, బీడీ మల్లేష్, బోడ సత్యనారాయణ, బోర్లకుంట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌కు మరమ్మతులు

భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయరహదారిలో భీమారం వద్ద ఫుట్‌పాత్ ధ్వంసం కాగా 'సాక్షి' దినపత్రికలో ఫుట్‌పాత్ ధ్వంసం అనే శీర్షికతో బుధవారం ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ప్రొక్లైనర్ ద్వారా ఫుట్‌పాత్‌ను తొలగించే పనులు చేపట్టారు. సమస్య పరిష్కరించేందుకు కృషి చేసిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

రామకృష్ణాపూర్: ఈ నెల 29న భద్రాది కొత్తగూడెంలో నిర్వహించనున్న సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ 7వ మహాసభల పోస్టర్లను బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సభల్లో చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, గజ్జి మల్లేశ్, నాగరాజు, వెంకటేష్, అప్పారావు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ జాఫర్ పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో బుధవారం మహాసభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుందర్, రాజేశ్వరి, శంకర్, పద్మ ఉన్నారు.

'డబుల్' బిల్లులు ఇప్పించండి

- తాగునీరు లేక అలమటిస్తున్నాం
- ఎంపీ ఎదుట మొరపెట్టుకున్న జోడేఘాట్ వాసులు



ఎంపీకి మొరపెట్టుకుంటున్న గ్రామస్తులు

కెరమెరి: డబుల్ బెడ్ రూంలు నిర్మించి చాలా కాలం గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం బిల్లులు ఇప్పించడంలో తాత్సారం చేస్తుందని, వెంటనే బిల్లులు ఇప్పించాలని జోడేఘాట్‌లోని డబుల్ బెడ్ రూం లబ్ధిదారులు ఎంపీ సోయం బాపూరావుకు మొరపెట్టుకున్నారు. జోడేఘాట్‌కు అమిత్‌షా వస్తున్న నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లను ఎంపీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీని కలిసిన లబ్ధిదారులు మాట్లాడుతూ ఆరు ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ రూ.లక్ష చొప్పున మాత్రమే ఇచ్చారని, రూ.5 లక్షలు మంజూరైతే రూ.4 లక్షల బిల్లులు మాత్రమే చేస్తున్నారని ఎంపీకి తెలిపారు. స్పందించిన ఎంపీ కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు అందాయని, అమిత్ షాకు ఇళ్లను చూపిస్తామని పేర్కొన్నారు. నీటి కోసం గోస పడుతున్నామని గ్రామస్తులు పేర్కొనగా మూడు రోజుల్లో రెండు చేతిపంపులు వేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పాట్నాపూర్‌లో బోరు మరమ్మతులకు రూ.6000 అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు కోట్నాక విజయ్, మురళి, ఆంజనేయులు గౌడ్, ఆత్మారాం నాయక్, జిల్లా కోట్నాక నాగోరావు, సతీశ్‌బాబు, వెంకట్ నాయక్, వెంకట్‌గౌడ్, చందునాయక్, శ్రీకాంత్, వేణు, సెడ్మకి తుకారాం, ప్రేం, గ్రామస్తులు రాజేశ్వర్, రాము, గంగు తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు' పకడ్బందీగా నిర్వహించాలి



కౌటాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు



కెరమెరి: ఏర్పాట్లు పరిశీలిస్తున్న వైద్యాధికారి

కౌటాల: కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌డీవో పీడీ, మండల ప్రత్యేకాధికారి సురేందర్ అన్నారు. కౌటాల గ్రామ పంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఉపాధిహామీ కూలీల ఆధార్ నమోదు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, ఎంపీవో సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ వొజ్జల మౌనిక్, ఉప సర్పంచ్ తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ ఉన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: నేటి నుంచి ప్రారంభమయ్యే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 18 ఏళ్లపైబడిన వారికి కంటి పరీక్షలు చేయనున్నట్లు వైద్యాధికారి వెంకటేశ్ తెలిపారు. ఈ నెల 19 నుంచి వచ్చే నెల 18 వరకు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఉచితంగా కంటి పరీక్షలు, కళ్లద్దాల పంపిణీ జరుగుతుందన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ సూర్యకాంత, ఫార్మసిస్ట్ ఖలీల్ హుస్సేన్ ఉన్నారు.

గెలుపోటములు సమానంగా చూడాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

తిర్యాణి: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకొని క్రీడాస్ఫూర్తి చాటాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఈనెల 21న మండలంలోని గడలపెల్లి గ్రామంలో నిర్వహించే పహడ్ కూపర్ లింగో పూజా కార్యక్రమం పురస్కరించుకుని క్రీడాపోటీలు బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీ క్రీడలతో పాటుగా చదువుల్లో రాణించి ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాక్షించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు, ఎస్సై రమేశ్, కైరిగూడ సర్పంచ్ కుర్సెంగ బాదిరావు, పీడీలు శ్రీనివాస్, సుభాష్ తదితరులు ఉన్నారు.